

# అలౌకికం

## సి. హెచ్. శాంతాదేవి

ఆఫీసు అయిదున్నరకి వదిల్తే పురుగులా, పరుగుల్తో ఆరుగంటలకల్లా చలపతిరావు గారింటికి చేరుకున్నాడు విశ్వనాథం.

ఆయన అర్జంటుగా ఒకసారి మాట్లాడాలి "రమ్మని కబురుచేస్తే" పెద్దమనిషి, ఎందుకో అనుకుంటూ గాబరాగా వెళ్లాడు.

అతను అనుకున్నట్టుగానే ఆయన ముందు వరండాలో పూనకం పూనిన వాడిలా కళ్ళెర్రచేసి పచార్లుచేస్తున్నారు.

"ఎందుకో పిలిపించారట?" వినయంగా అడిగాడు. జవాబుగా చేతిలో కాగితం అతనిమీదకి విసిరికొట్టారు.

"మీ ఫ్రెండ్ చేసిన ఘనకార్యం ఏమిటో చదివి తెలుసుకో. సంఘాన్ని వుద్ధరించే పెద్దమనిషి బయల్దేరాడు..."

విశ్వనాథం కాగితం విప్పి చదువుకున్నాడు. తెల్లబోతూ చలపతిరావు కేసి చూశాడు.

"ఇదేనటయ్యా, మీ చదువులు మీకు నేర్పిన జ్ఞానం! ఇవతల తల్లీ, తండ్రీ బ్రతికే వున్నామనుకున్నాడా, చచ్చామను

కున్నాడా?"

"..........."

"వాడితో వెళ్ళి చెప్పు. అట్లాంటి దౌర్భాగ్యపు పని చేశాడంటే వాడి మొహం చూసేదిలేదని చెప్పు. ఏమిటో అనుకుంటున్నాడు. వంశం, సాంప్రదాయం మంట కలపాలనుకున్నాడా?"

"మీరు తొందరపడకండి. విషయం ఏమిటో నేను కనుక్కుంటాను"

"ఇంకా ఏమిటయ్యా కనుక్కునేది? అందులో అంత స్పష్టంగా రాస్తేనూ."

విశ్వనాథం మరోసారి వుత్తరం చదివాడు

"నాన్నగారికి,

మీకు ఈ విషయం చాలారోజుల క్రిందటే చెప్పవలసింది. మీకున్న నమ్మకాలూ, చాదస్తాలూ నాకు తెలుసు. అందుకే చెప్పటానికి సంకోచించాను. ఇక ఇప్పుడు తప్పలేదు. ఎవరిద్వారానో మీరేదో విని, ఏమేమో వూహించుకోవటంకన్నా డైరక్టుగా నేనే విషయం తెలియబరిస్తే మంచిదని ఈ విధంగా రాస్తున్నాను. సుశీల భర్త యాక్సిడెంట్లో పోయాడు. ఆమె పరిస్థితికి జాలిపడిగానీ, ఆమెను వుద్ధరించాలనిగానీ నా వుద్దేశం గాదు. కొన్ని సంవత్సరాలుగా మేము ఒకర్నొకరు ఎరుగుదుము. సుశీలని నేను బాగా అర్థంచేసుకున్నాను. ఆమె ఒక ఇల్లాలుగానేగాక, మీ యింటికి తగిన కోడలిగా కూడా రాణించగలదని నా నమ్మకం. నేను సుఖంగా - వుండాలనే గదా మీరైనా కోరుకునేది. మీకు అంగీకారమైతే ఇంటికి వచ్చి కోడల్ని అమ్మకూ, మీకూ చూపాలనుంది. నా నిర్ణయం ఎట్టి పరిస్థితిలోనూ మారదు."

అసలు విశేషం మూర్తి విశ్వనాథానికి రాసిన వుత్తరంలో వుంది...

"విశ్వా,

ఈ సంగతి నాన్నగారికి రాయటానికి సాహసించలేకపోయాను. మేము పెళ్ళి చేసుకోకుండా కలిసివుండాలని నిశ్చయించుకున్నాము. ఒకరిమీద ఒకరికి నమ్మకం వుండాలిగానీ సాక్ష్యాలూ, ఋజువులూ అవసరంలేదని నా నమ్మకం..."

ఆ పైన చదవటానికి ఇష్టపడలేదు విశ్వనాథం. మూర్తి చాల తప్పుమార్గాన పోతున్నాడనే అభిప్రాయాని కొచ్చాడు. ఇట్లాంటి స్నేహితుణ్ణి దూరం చేసుకోవటం అన్ని విధాలా శ్రేయస్కరమనే నిర్ణయాని కొచ్చాడు.

విశ్వనాథానికి కొన్ని ఖచ్చితమయిన అభిప్రాయా లున్నాయి. పెళ్ళి అనే తంతు చాలా పవిత్రమైనదని అతని వుద్దేశం. ఈనాడు మిడిమిడి జ్ఞానంతో అనేకమంది అనేక రకాలుగా వూహించినా — సంప్రదాయానికి ఎదురీదటం తెలివిగలవాళ్ళు చేసే పనిగాదు. మన పూర్వీకులు ఏదో ఆలోచించే ఈ ఆచారాలు ఏర్పరచి వుంటారని అతననుకుంటాడు

రైలు దిగి వూళ్ళోకి జట్కాబండి

మాట్లాడుకుంటున్నారు స్నేహితులిద్దరూ.

మూర్తి ఏదో చెప్తుంటే, మౌనంగా వింటున్నాడు విశ్వనాథం.

"నువ్వు రావటం నాకు చాలా సంతోషంగా వుంది. ఒక విధంగా బంధువులూ, స్నేహితులు అందరూ నన్ను వెలివేసినట్టే అనుకుంటున్నాను..."

విశ్వనాథం మాట్లాడలేదు. అతని మొహం చాలా సీరియస్‌గా వుంది.

మూర్తి ఇంటివేపు దారి చూపుతుంటే విశ్వనాథం అడ్డుతగిలాడు.

"నేను హోటల్‌లో దిగుతాను. ఏదైనా మంచి హోటలుంటే చూడు."

మూర్తి చిన్నబుచ్చుకున్నాడు. ఐనా విశ్వనాథం పట్టుబట్టడంతో మరేమన లేదు.

ఒక పెద్ద హోటల్ ముందు జట్కా ఆగింది.

"నా మాటకేంగానీ, నువ్వొస్తావని నాలుగు రోజుల్నుంచీ చెపుతున్నానేమో, సుశీల ఎదురుచూస్తోంది. నువ్వు హోటల్లో వుంటావని తెలిస్తే తను చాలా డిజప్పాయింట్ అవుతుంది."

విశ్వనాథం జవాబు చెప్పలేదు.

తన సామాను లోపలకు తీసుకువెళ్ళమని సర్వర్‌తో చెప్పి మూర్తితో ముభావంగా,

"మళ్ళీ కలుద్దాం" అని మాత్రం అని మెట్లెక్కి పైకి వెళ్ళిపోయాడు.

మంచంమీద వాలి మూర్తిని గురించి ఆలోచించాడు. చాలా తృప్తీ, సంతోషం అతని మొహంలో స్పష్టంగా కనబడుతున్నాయి. తన సుఖం, తన స్వార్థం చూసుకున్నాడు. తృప్తిగా వుండక మరెలా వుంటాడు! అవతల తండ్రి హృదయం ఎంత నలిగిపోతోందో, తను చేసిన నికృష్టమైన పనికి ఆయన నలుగురిలో తలెత్తలేక ఎలా తల్లడిల్లుతున్నాడో ఒక్కనాడైనా ఆలోచించాడా! ఆలోచించినవాడైతే అలా చేయడనలు.

విశ్వనాథం మూర్తిని ఆఖరుసారి కల్సుకున్నది రైల్వే స్టేషన్‌లోనే. రైలు రెండు గంటలు లేటని తెలిసి మూర్తితో మాట్లాడాలని నిశ్చయించుకున్నాడు.

అంత క్రితం చలపతిరావు అన్న విషయాలన్నీ మననం చేసుకుంటూ అసలు విషయాని కొచ్చాడు విశ్వనాథం.

"ప్రతివాడికీ పర్సనల్ లైఫ్ అనేది వుంటుంది. అందులో 'పెళ్ళి' అనే విషయం అతి ముఖ్యమైనది. పెళ్ళి అనే పదానికి నేను చెప్పుకునే అర్థం వేరుగా ఉంటుంది."

"ఏమిటా అర్థం? ఎవరికీ తెలియకుండా లేవదీసుకుపోయి వుంచుకోవటమా?" వెటకారంగా అన్నాడు విశ్వనాథం.

ఒక్కక్షణం నల్లబడింది మూర్తి మొహం.

"నాన్నగారు పెద్దవారు. ఆయన భావాలు వేరుగా వుంటాయి. కనీసం నువ్వయినా నన్నర్థం చేసుకుంటావని నే

నమకున్నాను."

"నలుగురూ నడిచే దారిన వెడితే తప్పక సంతోషించేవాణ్ణి. నువ్వు తప్పు దారిన పోతున్నావు."

"అంటే నేను చేసిన పని తప్పంటావు. పదిమంది పెద్దల్ని పోగేసి నా భార్య అవే వ్యక్తి మెడలో ఒక తాడు బిగించటం సంఘం దృష్టిలో గొప్ప పని. ఆ తర్వాత భార్యాభర్తలిద్దరూ తన్నుకు చచ్చినా ఈ పెద్దల్లో ఎవరూ జవాబుదారీ కారు. ఎవరూ పట్టనట్టే పూర్చుంటారు. ఆర్భాటంగా శాస్త్రోక్తంగా — పెళ్ళిచేసుకున్న వాళ్ళు ఎంతమంది కలిసి కాపురాలు చేస్తున్నారు? నేను చేసిన తప్పేమిటి? సుశీలను ప్రేమించాను. పెళ్ళి అవసరం లేదనుకున్నాము. కలిసి జీవిస్తున్నాము. నామీద ఆమెకు నమ్మకం వుంది. ఆమె మీద నాకు నమ్మకం వుంది. ఇష్టంలేదు అనుకుంటే విడిపోతాం. ఇందులో ఒకరికి జరిగే కష్టనష్టాలేమిటో నాకు అర్థం గాదు..."

"ఇది నీ ఒక్కడికే సంబంధించిన విషయం కాదనీ ఇందులో పెద్దవాళ్ళు మీ అమ్మా, నాన్నగార్ల జీవితాలు ఆధారపడి వున్నాయనీ అంటున్నాను."

"ఆవేశం తగ్గాక అమ్మా, నాన్నా సుశీలని తప్పక ఆదరిస్తారు. వారిపట్ల నాకా విశ్వాసం వుంది."

ఇంక ఆ మూర్ఖుడితో వాదించి ప్రయోజనంలేదని పూరుకున్నాడు విశ్వనాథం. అట్లాంటివాడు తనకి స్నేహితుడు అని చెప్పుకోవటం నిజంగా తన దురదృష్టమే ననుకున్నాడు.

ఎలాగయినా మూర్తిని కలిసి ఈ ప్రయత్నం విరమించుకునేలా చెయ్యమని ప్రాధేయపడిన చలపతిరావుగారికి ఏం చెప్పుకోవాలో తెలీలేదు అతనికి.

అప్పట్నుంచీ అతను మూర్తిని కలవటం మానేశాడు. దాదాపు అతని స్నేహం వదిలేసుకున్నట్టే భావించాడు.

కానీ తప్పనిసరిగా ఈ ట్రెయినింగ్ సందర్భంగా అతనుంటున్న వూరికే రావాల్సి వచ్చింది.

ఫ్రెండ్స్ ద్వారా సంగతి తెలుసుకున్న మూర్తి స్టేషన్కు వచ్చాడు. ట్రెయినింగ్ పదిహేనురోజులూ తన యింట్లోనే వుంచుకోవాలనుకున్నాడు.

కానీ విశ్వనాథం పిసమంత మారలేదని తెలుస్తూనే వుంది.

సాయంత్రం పొద్దు వాలింది.

హోటల్ రూమ్లో బద్ధకంగా పడుకున్న విశ్వనాథం బయట అడుగుల చప్పుడు, మాటలు వినబడి లేచి కూర్చున్నాడు.

హోటల్ బాయ్ బెల్ నొక్కాడు.

తలుపు తీయగానే మూర్తినీ, సుశీలనీ లోపలకి ప్రవేశపెట్టి తను వెళ్ళిపోయాడు.

విశ్వనాథం మత్తు వదిలిపోయింది వాళ్ళిద్దర్నీ చూడగానే. ముఖకవళికలు మారిపోయాయి.



ముక్తసరిగా ఆహ్వానించాడు.

"నీ కిష్టం వుండదని తెల్సి కూడా రాక తప్పలేదు సుశీల బలవంతంమీద. నువ్వు హోటల్‌లో వుండటం ఆమె సపేమిరా ఒప్పుకోవటం లేదు. ఎలాగయినా ఒప్పించి విన్నింటికి తీసుకు వెళ్ళాలని వచ్చాము..."

"సారీ, నా కిక్కడ సౌకర్యంగానే వుంది. ఒకరోజా, రెండు రోజులా కాదు. పదిహేను రోజులు. మీకు అనవసరంగా శ్రమ..." తల వంచుకుని అన్నాడు.

సుశీల కలగచేసుకుంది.

"మాకు శ్రమలేదు. చాలా సంతోషం కూడాను. ఆయనా, మీరూ ఎంతో దగ్గర స్నేహితులని చెపుతూ వుంటారు. మేము వూళ్లోవుండికూడా మీరు వేరేగావుండటం ఆయన మాకెలావున్నా నాకు బాధగా వుంటుంది. మా కోసం వచ్చేవాళ్ళు మాత్రం ఎవరున్నారు?"

విశ్వనాథం అప్రయత్నంగా తలెత్తి చూశాడు.

ఆమె మాటల్లో నిజాయితీ ధ్వనించింది. కేవలం ఒక ఆత్మీయుడిగా భావించి అభ్యర్థిస్తున్నట్టే మాట్లాడింది.

"విశ్వా, ఇక నీ వల్ల కాదు. త్వరగా సామాను సర్దేయి. నువ్వు బయల్దేరకపోతే సుశీల ఇక్కణ్ణించి కదిలేలా లేదు."

విశ్వనాథంకి నిజంగానే యిష్టంలేదు వాళ్ళింటికి వెళ్ళటం...

కాఫీ మూర్తిని తిరస్కరించినంత తేలిగ్గా సుశీలమాట కాదనలేకపోయాడు- ఆమెపట్ల మనసులో ఏహ్యాభావం వున్న మాట నిజమే:

విశ్వనాథం హోటల్ బాయ్‌ని పిలిచి బిల్లు తెమ్మని పంపి సూట్‌కేస్ సర్దాడు.

మూర్తి తేలిగ్గా నిట్టూర్చాడు.

సుశీల ఒక గది విశ్వనాథం కోసం కేటాయించింది.

మూర్తి ఇంట్లో వున్నా లేకపోయినా అతను వున్నప్పుడెలా ప్రవర్తించేదో, లేనప్పుడూ అలానే ప్రవర్తించేది సుశీల. ప్రత్యేకంగా తనపట్ల శ్రద్ధాసక్తులు తీసుకోవటంలేదనీ ఇంట్లో వ్యక్తిలా అతి సహజంగా ప్రవర్తిస్తూందనీ అర్థమైంది విశ్వనాథానికి.

ప్రత్యేకంగా గమనించకపోయినా ఒకే యింట్లో మసులుతున్నప్పుడు ఆ వ్యక్తి ప్రవర్తనా, స్వభావం తెలిసిపోతూనే వుంటాయి.

అన్నిటికన్నా ముఖ్యంగా అతనికి సుశీలలో నచ్చిన విషయం ఆమె మొహాన ఎప్పుడూ చిరునవ్వు వెలుగుతూ వుండటం. అది మనిషికి దేముడిచ్చిన వరాల్లో ముఖ్యమైనదని అతనికి తెలుసు:

మూర్తి అంత తృప్తిగా వుండటానికి కారణమేమిటో విశ్వనాథంకి త్వరలోనే తెలిసిపోయింది. భార్య ఎప్పుడూ ఇంట్లో సంతోషంగా తిరుగుతూవుంటే ఏ మగాడైనా తృప్తిగా బ్రతకగలడు.

ఆ యింట్లో ఐశ్వర్యపు చిహ్నాలేమీ లేవు. మధ్య తరగతి సంసారంలాగే వుంది. అయినా వాళ్ళిద్దరూ ఎప్పుడూ ఆనందంగానే వుంటారు.

విశ్వనాథంకి ఆడవాళ్ళల్లో కొన్ని నచ్చని గుణాలున్నాయి. బిగ్గరిగా మాట్లాడటం ఒకటి. ఇంట్లో సుశీల గొంతు ఎప్పుడో తప్పితే వినబడదు. దూరం మంచి అరవకుండా దగ్గరగా వచ్చి చెపుతుందామె. ఈ విషయం ఎంతో నచ్చింది విశ్వనాథంకి. కొంతమంది భార్యలు ఎప్పుడూ చెడవాగుతూ వుంటారు భర్త కనబడిందే తడవుగా. తను చెప్పే సంగతి అవసరమా, అనవసరమా అని చూసుకోరు. చాలామంది మగవాళ్ళు ఎక్కువకాలం బయట తిరుగుతూ వుండటానికి యిది కూడా ఒక కారణం కావచ్చును.

సాయంత్రం ఎప్పుడైనా మూర్తి త్వరగా ఇంటికి వస్తే అలా బజారు పోదాం రమ్మంటాడు. వాళ్ళిద్దరూ వెళ్తారులే అనుకుని తను లోపలే వుండిపో

తాడు. కానీ వాళ్ళిద్దరూ వెయిట్ చేస్తూంటారు బయట. తప్పనిసరిగా వెడతాడు.

బజారుకు వెళ్ళినప్పుడు సుశీల ఒక్క వస్తువు కావాలని భర్తని అడగటం అతనింతవరకూ చూడలేదు.

మూర్తి "ఏదైనా కావాలా?" అని అడిగితే "ఇప్పుడెందుకులెండి. మరోసారి చూద్దాము..." అంటుంది.

"చీరెలు కావాలా?" అనడిగితే,

"ఇప్పుడొద్దు. సరదాగా కాసేపు తిరుగుదాం. అయిస్ క్రీమ్ కొనండి. తింటూ నడవటం నాకు చాలా యిష్టం."

చీరెలు వద్దు అయిస్ క్రీమ్ కొనమనే ఆడవాళ్ళు చాలా అరుదుగా వుంటారు.

ఎక్కడంటే అక్కడ అప్పులు పెట్టి చూసిన చీరెనల్లా కొనుక్కువచ్చే భార్య గుర్తుకువచ్చింది విశ్వనాథంకి.

మూర్తి లోకవిరుద్ధంగా ప్రవర్తించాడే అనే కినుకా, చలపతిరావుగారి అవేదనా ఈ రెండు విషయాలూ పూర్వమంతగా కలతపర్చటం మానేశాయి.

ప్రత్యేకంగా గుర్తుకు తెచ్చుకుని కాఠిన్యం తెచ్చుకోవలసివస్తోంది వారిద్దరి మీదా.

ట్రెయినింగ్ పదిహేను రోజుల్లోనూ రెండు రోజులు జ్వరంతో పడకేశాడు విశ్వనాథం.

ఆ రెండు రోజులూ సుశీల ఆత్మీయతనూ, దగ్గిరతనాన్నీ పూర్తిగా అనుభవించాడు విశ్వనాథం. ఆమె తన ఒక్కడి విషయంలోనేగాదనీ, భర్తకిగానీ, మరే పరాయి వ్యక్తికిగానీ అవసరమైతే అదే విధంగా సపర్యలు చెయ్యగలదని—వూహించాడు.

ఇంకో రెండురోజుల్లో విశ్వనాథం వెళ్ళిపోతాడు. మూర్తి వచ్చి,

"అలా బయటకు వెడదామా?" అన్నాడు.

"అలాగే" తయారయి బయటకు నడిచాడు. వెడుతూ యథాలాపంగా లోపలికి చూశాడు.

అది గ్రహించిన మూర్తి,

"తను రానందిలే. మనం పోదాం." ఇద్దరూ నడిచారు.

"మేమిక్కడికి వచ్చినాక మా మొదటి అతిథి నువ్వే! నాకన్నా సుశీల ఎక్కువ సంతోషించింది. స్నేహంకోసం ప్రాణం పెట్టే మనిషి ఆమె."

విశ్వనాథం జవాబు చెప్పలేదు. ఆ సంగతి అతను వచ్చిన రెండోరోజే గ్రహించాడు.

మూర్తిచేసిన తప్పు ఒప్పని అంగీకరించటానికి అతనికి అహం అడ్డమొస్తోంది.

"మొదటిచూపులోనే ప్రేమించామనుకుని పెళ్ళిచేసుకోవటానికి మేము టీనేజి వయసులో వాళ్ళం కాదు. దాదాపు అయిదేళ్ళు ఒకళ్ళ నొకళ్ళు స్టడీచేసి ఒక నిశ్చయాని కొచ్చాం. ముప్పయి ఏళ్ళు కలిసి వున్నా ఒకరి నొకరు అర్థంచేసుకోలేక

ఒకే తప్పుకింద బ్రతికేవాళ్ళు ఎంతమంది లేరు? మాకా బాధ లేదు. మేము వద్దు అనుకుంటే విడిపోగల ధైర్యం మాకు ఉంది..."

'మీకా అవసరం రాదు మూర్తీ...' అనుకున్నాడు విశ్వనాథం. తనని అర్థం చేసుకుని సంసారాన్ని సాగించే భార్యని వదులుకునే బుద్ధిహీను డెవడూ వుండడు ఈ ప్రపంచంలో.

మనిషికీ, మనిషికీ మధ్య...

ఒక స్త్రీ, ఒక పురుషుడు- పరస్పర అవగాహన- పెళ్ళి అనే ముద్రలేకుండానే వీళ్ళిద్దరూ ఆ విషయంలో విజయం సాధించారు. ఈ రహస్యం తెలుసుకున్న భార్యలు సంసారాన్ని స్వర్గతుల్యం చేయగలరు

అయినా ఈ మాటలేవీ పైకి అనలేదు విశ్వనాథం.

"ఏ తృప్తీ... సంతోషం... వీటి వెనుక మీ నాన్నగారు, ఆ వెనుక సంఘం... మీరు అడివిలో బ్రతకటం లేదు."

"ఆ మాట నిజమే! సంఘం అంటే ఎవరు? నువ్వూ, నేనూ మరి కొంతమంది. ఇవ్వాళ కొత్తగా కనపడిన విషయం పది రోజులకి పాతబడిపోతుంది. అప్పుడు మరో విషయం పట్టుకుంటారు ప్రజలు. నాన్నగారి సంగతంటావా, ఆయన అవకాశం యివ్వాలేగానీ సుశీల ఆయన మనసు దోచుకోగలదు. నాకా నమ్మకం వుంది."

అతని మాటల్లో సత్యం వుందనిపించింది.

చలపతిరావుగారు సుశీలని ఇష్టపడలేదంటే ఆయన మూర్ఖులై వుండాలి. భార్య అంటే ఇలా వుండాలి అనిపిస్తుంది ఏ మగవాడికైనా.

విశ్వనాథం ఈ ట్రెయినింగ్ పదిహేను రోజులూ చాలా హేపీగా ఫీలయినాడు తనకే తెలియకుండా.

విశ్వనాథం ప్రయాణమైనాడు.

భార్యభర్తలిద్దరూ స్టేషన్‌కు వచ్చారు.

మూర్తితో చెయ్యి కలిపి, సుశీలవేపు తిరిగి మనఃస్ఫూర్తిగా నమస్కారం చేశాడు.

"త్వరలోనే మీ రందరూ కలుసుకుంటారు. మీ ఫాదరు నువ్వనుకున్నంత వివేకంలేనివాడు గాదు..."

మూర్తికి తెలీదు, విశ్వనాథం దారిలోనే రైలు దిగిపోయి చలపతిరావుగారి దగ్గరకు వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడని.